## నేటి నుంచి గోన్‌గొప్పులలో బ్రహ్మోత్సవాలు

భీమ్‌గల్, డిసెంబర్ 4: మండలంలోని గోన్‌గొప్పుల గ్రామంలో ఉన్న శ్రీహరిహర క్షేత్రంలో ఈనెల 5 నుంచి 7 వరకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు చెరుకుపిల్లి లక్ష్మారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

## అంబులెన్స్‌లో ప్రసవం


పాపను కుటుంబీకులకు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

భీమ్‌గల్, డిసెంబర్ 4 : మండలంలోని రహత్‌నగర్ గ్రామానికి చెందిన స్వర్ణ అనే గర్భిణి ఆదివారం రాత్రి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో దవాఖానకు తలిస్తుండగా నొప్పులు రావడంతో రహత్‌నగర్-పల్లికొండ మార్గమధ్యంలో మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ సుందర్, పైలట్ రాంకుమార్ తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చేర్చి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.

**బోధన్ పట్టణంలో..**

శక్కర్‌నగర్. డిసెంబర్ 4: బోధన్ పట్టణంలోని ఉద్మీర్‌గల్లీకి చెందిన న్యావంది లావణ్యకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఆదివారం రాత్రి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్‌లో బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా.. జలాల్ బుకారీ దర్గావద్ద నొప్పులు రావడంతో మార్గమధ్యంలో మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు టెక్నీషియన్ లక్ష్మణ్, పైలట్ కేశవ్ కుమార్ తెలిపారు. తల్లి, బిడ్డను బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.


బోధన్‌లో..

## 8న కమ్మర్‌పల్లి మండల పరిషత్ సమావేశం

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 4 : కమ్మర్‌పల్లి మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్ రెడ్డి సోమవారం తెలిపారు. ఎంపీపీ లోలపు గౌతమి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ అభివృద్ధి నివేదికలను ఈ నెల 7వ తేదీ లోపు అందించాలని ఆయన సూచించారు.

## ఘనంగా భీమన్న ఉత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘ సభ్యులు

ముప్కాల్, డిసెంబర్ 4: మండల కేంద్రంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం భీమన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో భీమన్న దేవుడిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంఘం పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ప్రతినిధులు కంచు సతీశ్, వేంపల్లి గణేశ్, కంచు మోహన్, లింగం, కంచు విజయ్, మగ్గిడి రాజేందర్, వేంపల్లి ప్రతాప్, నాని, శ్రావణ్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో భవనాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు!
- కూల్చివేయాలని కోరుతున్న స్థానికులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 4: బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో గతంలో ఎన్ఎస్ఎఫ్ కొనసాగుతున్న కాలంలో నిర్మించిన పలు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాలు, ఖాళీ స్థలాలు ప్రైవేట్ యాజమాన్యం ఆధీనంలో ఉండగా, మరికొన్ని కోర్ కమిటీ ఆధీనంలో ఉన్నాయి. అయితే ఈ భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోవడంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాల్లో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్, ఏసీపీ కార్యాలయాలు ఉండగా.. పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు నాలుగు భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇందులోకి వెళ్లేందుకు కొందరు దారిని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఇప్పటికే ఈ భవనాలు పనికిరాకుండా పోగా, వాటివైపు ఎవరూ కన్నెత్తి చూడడంలేదు. దీంతో సదరు భవనాలను కూల్చి పైకప్పునకు ఉపయోగించిన రాడ్లు తొలగించుకుని అమ్ముకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థలకు చేరిన ఈ భవనాలను పూర్తిగా కూల్చివేయాలని అధికారులను కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఏసీపీ కార్యాలయ సమీపంలోని ఓ భవనం


శక్కర్‌నగర్‌లో ఎంవీఐ కార్యాలయం వెనుక శిథిలావస్థకు చేరిన పాత భవనం


భవనం శిథిలం కావడంతో చోరీకి గురైన వస్తువులు

# బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు


చిట్టాపూర్‌లో విజయ చిహ్నం చూపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాల్కొండ, డిసెంబర్ 4: బాల్కొండ నియోజకవర్గం నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో వేముల వియ్యంకుడు దయానందరెడ్డితో కలిసి బీఆర్ఎస్ నాయకులు సోమవారం సంబురాలు జరుపుకొన్నారు. చిట్టాపూర్ గ్రామ ప్రజలు మంచి మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజా గోవర్ధన్ గౌడ్, ఉపసర్పంచ్ దేవనంది రాజేందర్, పసుల రాజేందర్, అల్లకొండ రాజేశ్వర్ ఉన్నారు.

**ఇజ్రాయెల్‌లో..**

వేల్పూర్, డిసెంబర్ 4 : బాల్కొండ ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్‌రెడ్డి మూడోసారి ఎన్నికవడంపై ఇజ్రాయెల్‌లో ఉన్న వేల్పూర్ గ్రామవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకొన్నారు.


ఇజ్రాయెల్‌లో కేక్ కట్ చేస్తున్న వేల్పూర్ గ్రామవాసులు

# బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుంది..

పార్టీ ఏర్గట్ల మండల నాయకులు


తాళ్లరాంపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం

ఏర్గట్ల, డిసెంబర్ 4: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం అన్నారు. మండలంలోని తాళ్లరాంపూర్ గ్రామంలో పార్టీ కార్యకర్తలతో కలిసి సోమవారం సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ నాయకత్వంలో వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. తెలంగాణ సాధించగా..పదేండ్లపాటు సేవ చేసే అవకాశం ప్రజలు ఇచ్చారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని, ఒకవేళ మాట తప్పితే ప్రజల పక్షానా నిలబడి పోరాడుతామని స్పష్టం చేశారు. సమావేశంలో సర్పంచ్ భీమనాతి భానుప్రసాద్, మాజీ సర్పంచ్ తుమ్మల ప్రభాకర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బోనగిరి రమేశ్, నాయకులు దోర మోహన్, రాజు, దిబ్బ గంగాధర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.